సాక్షి కాకినాడ

మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



ఘనంగా అష్టోత్తర అర్చనలు


ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం స్వామివారి అష్టోత్తర పూజలు ఘనంగా చేశారు. ఆలయ ఈఓ కిషోర్‌కుమార్ పర్యవేక్షించారు.



విఘ్నేశ్వరునికి కళన్యాస పూజలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారికి వేదపండితుల ఆధ్వర్యంలో సోమవారం కళన్యాస పూజలు జరిపారు. స్వామికి పంచామృతాభిషేకం, లక్ష గరిక పూజలు చేశారు.

సముద్రంలోకి మిగులు జలాలు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 3,40,543 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ఇక్కడ 8.60 అడుగులకు నీటిమట్టం చేరింది. సాగు అవసరాలకు తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

శృంగవరంలో డయేరియా



రౌతులపూడి సీహెచ్‌సీలో రోగి ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ

రౌతులపూడి: మండలంలోని శృంగవరంలో డయేరియా కేసులు పెరుగుతున్నాయి. నాలుగు రోజులుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాంతులు, విరేచనాలు, జ్వరంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం రౌతులపూడి సీహెచ్‌సీకి వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారు. గ్రామానికి చెందిన లొండా గోవిందమ్మ, అల్లు అమ్మాజీ, తలపేటి శ్రీకీర్తన, ఎమ్మిలి రజిత, జి.అప్పయమ్మ, కొల్లాబత్తుల కుమారి, పి.కామాక్షి తదితరులు 21 మంది డయేరియాతో రౌతులపూడి సీహెచ్‌సీలో చేరారు. వీరందరికీ వైద్యులు పరీక్షలు చేసి చికిత్స అందిస్తున్నారు. ఇందులో ఆరుగురికి తగ్గుముఖం పట్టడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. మిగిలిన పదిహేను మంది ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న డీఎంహెచ్‌ఓ శంకర్ నాయక్ గ్రామంలో పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో రోగులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగారు. రోగులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీహెచ్‌సీ వైద్యాధికారి జానకీదేవికి ఆదేశాలు ఇచ్చారు.

పోలీస్ ప్రజా సమస్యల వేదికకు 52 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 52 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆ ఫిర్యాదులను స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యల తక్షణ పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ఫిర్యాదుదారులు తమ సమస్యలను స్థానిక పోలీస్ స్టేషన్లలో నివేదిస్తే, అవి ప్రజా సమస్యల పరిష్కార వేదిక పరిధిలోనే నమోదవుతాయని ఎస్పీ వివరించారు.

వైఎస్సార్ ఓ నమ్మకం

- జిల్లాలో మహానేత వర్ధంతి కార్యక్రమాలు
- నివాళులు అర్పించిన పార్టీ శ్రేణులు
- వివిధ సేవలు చేపట్టిన ప్రజాప్రతినిధులు

వైఎస్సార్ అంటే పేరే కాదు.. నమ్మకానికి, విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనం.. ఆయన పేరు చెప్పగానే కళ్ల ముందు కదలాడే ఆరోగ్య శ్రీ, కుయ్ కుయ్‌మంటూ క్షణాల్లో వచ్చి వాలిపోయే 108, 104.. ఇలా ఎన్నో లెక్కలేనన్ని గుర్తుకు వస్తాయి. పెద్దాయనగా పిలుచుకునే అటువంటి నేత మరొకరు ఉండరు కాబట్టే మన మధ్య ఆయన భౌతికంగా లేకపోయినా 15 ఏళ్లుగా జిల్లాలో ఆయన అభిమానులు, రాజకీయాలకు అతీతంగా ఆయనను ఆరాధించే సంస్థలు, నాయకులు ఏటా వర్ధంతిని ఘనంగా జరుపుకొంటున్నారు. సోమవారం మహానేత వర్ధంతి సందర్భంగా కాకినాడ జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు.



కాకినాడలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: జిల్లాలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన నిలువెత్తు విగ్రహాలను పూలమాలలతో ముంచెత్తి మహానేత రాజశేఖరరెడ్డిపై గుండెల్లో దాచుకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇటు మెట్ట, డెల్టా అనే తేడా లేకుండా వైఎస్సార్‌కు నివాళులర్పించారు. జిల్లా ప్రగతిలో వైఎస్ వేసిన ముద్ర నిత్య స్మరణీయమని అయా పార్టీల నేతలు అన్నారు. జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్లు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ స్థానిక సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరుపుకొన్నారు. రమణయ్యపేట వైద్యనగర్‌లో కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో దివంగత నేత రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ ప్రచార సెల్ కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, బెజవాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు విశాఖపట్నంలో ఉండటంతో అక్కడే రాజశేఖరరెడ్డి వర్ధంతిని జరుపుకొన్నారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ సిటీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో కాకినాడ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి రాజశేఖరరెడ్డి సేవానిరతిని కొనియాడారు. పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కొడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు. పిఠాపురంలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎంపీ వంగా గీత విశ్వనాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రానికి వైఎస్సార్ చేసిన సేవలను కొనియాడారు. గొల్లప్రోలులో జెడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల లోవరాజు ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నేతలు, ఉప్పాడ కొత్తపల్లి మండలంలో నాయకులు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. జగ్గంపేట బస్టాండ్ సెంటర్, బూరుగుపూడి, గోకవరం సెంటర్‌లలో వైఎస్ విగ్రహానికి మాజీ మంత్రి, కో ఆర్డినేటర్ తోట నరసింహం ఆధ్వర్యంలో పార్టీ నేతలు పూలమాలలతో నివాళులర్పించి సేవలను కొనియాడారు. పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తండ్రి రామస్వామి వైఎస్సార్ సేవలను ప్రస్తుతించారు. జగ్గంపేట, గోకవరం రోడ్డు, టవర్‌కాలనీ, జయా నర్సింగ్ హోం వీధిలో జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవి రఘురామ్ ఆధ్వర్యంలో రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిర్లంపూడిలో పార్టీ నేతలు వైఎస్సార్ వర్ధంతిని జరుపుకొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరంలో ఎంపీపీ పర్వత రాజబాబు ఆధ్వర్యంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుని శ్రీరామా సెంటర్‌లో వైఎస్సార్ వర్ధంతిని పార్టీ నాయకుడు యనమల కృష్ణుడు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. తొండంగి మండలం ఏవీ నగరంలో తుని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీకృష్ణ పార్టీ నేతల సమక్షంలో వైఎస్సార్‌కు నివాళి అర్పించారు. తుని రూరల్ డి.పోలవరం, కొత్తూరు ఎస్.సూరవరం, తాళ్లూరు, ఎస్.అన్నవరం, తొండంగి, కోటనందూరు మండలాల్లో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దాపురం, సామర్లకోటలలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఆవాల లక్ష్మీనారాయణ తదితర నేతలు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.



పిఠాపురంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడుతున్న మాజీ ఎంపీ గీత

నాగ సాధువులకు ఆశ్రయం

- ప్రత్యేక బస్సులో తిరుమలకు..
- ఏర్పాటు చేసిన వాసవీ సభ్యులు



సామర్లకోట వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నాగ సాధువులు

సామర్లకోట: తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లాల్సిన నాగ సాధువులు సామర్లకోటలో చిక్కుకున్నారు. 50 మంది నాగ సాధువులు అయోధ్య నుంచి వస్తూ విశాఖపట్నంలో తిరుమల ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. ఈ రైలు ఆదివారం రాత్రి సామర్లకోట వచ్చేసరికి రద్దు చేశారు. దీంతో రైలులోని నాగ సాధువులు సామర్లకోటలో దిగాల్సి వచ్చింది. ఆర్పీఎఫ్ అధికారుల సూచన మేరకు వారికి వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ సభ్యులు ఆశ్రయం కల్పించారు. రాత్రి భోజనంతో పాటు ఉదయం స్నానాల సదుపాయం కల్పించి అల్పాహారం ఏర్పాటు చేశారు. తర్వాత తిరుమల వెళ్లేందుకు ప్రత్యేక బస్సును వాసవీ సభ్యులు ఏర్పాటు చేశారు. అయోధ్య నుంచి వచ్చిన తాము తిరుమలలో స్వామివారిని దర్శించుకుని, తర్వాత రామేశ్వరం వెళ్లి అక్కడి నుంచి హరిద్వార్ చేరుకుంటామని నాగ సాధువులు తెలిపారు. సామర్లకోటలో వాసవీ సభ్యులు తమకు కల్పించిన సదుపాయాలను మరచిపోలేమన్నారు. కార్యక్రమంలో వాసవీ సభ్యులు కటకం సురేష్, సతీష్, సృజన్, మాజేటి కృష్ణ, కాపుగంటి పైడిరత్నం, కంచర్ల నాగేశ్వరరావు, ఊరా సత్యనారాయణ తదితరులు ఏర్పాట్లు చేశారు. ఈ బస్సు ఏర్పాటుకు రూ.56 వేలను కటకం రాంబాబు సమకూర్చారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన చల్లారావు

సామర్లకోట: స్థానిక అమ్మాజమ్మ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న నేదూరి చల్లారావు (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అమ్మాజమ్మ అపార్ట్‌మెంట్ రోడ్డులో వెళ్తున్న వ్యక్తులు తుప్పల వద్ద చల్లారావు మృతదేహం ఉండటంతో అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దాంతో వారు వచ్చి మృతదేహాన్ని ఇంటికి తీసుకు వెళ్లారు. అయితే తలపై గాయం, ముఖంపై గాట్లు ఉండటంతో హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై వీఆర్ మూర్తి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం జాతీయ రహదారిపై భ్రమరాంబిక టిఫిన్ సెంటర్ వద్ద 50–60 సంవత్సరాల వయస్సున్న వ్యక్తిని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ప్రత్తిపాడు సీహెచ్‌సీకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు ప్రత్తిపాడు పోలీసు సెల్ నంబర్ 94407 96530 లను సంప్రదించాలని కోరారు. ఏఎస్సై కె.వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేపట్టారు.

వరద బాధితులకు సహాయం అందించండి

కాకినాడ సిటీ: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో వర్షాలు, వరదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలను ఆదుకునేందుకు వస్తు, ధన రూపంలో విరాళాలను సేకరిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ సగిలి సోమవారం రాత్రి తెలిపారు. స్వచ్ఛందంగా సహాయం చేసే వారు కాకినాడ కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారికి నగదు, చెక్కు, వస్తు రూపంలో గాని అందజేయవచ్చన్నారు. ప్రకృతి విపత్తు కారణంగా నిరాశ్రయులైన ప్రజలను ఆదుకునేందుకు సామాజిక బాధ్యతతో వివిధ స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి సహాయం చేయాలని కలెక్టర్ కోరారు. రాష్ట్రంలో విపరీతంగా కురిసిన వర్షాలతో కృష్ణా నది, బుడమేరు నది, గోదావరి ఉపనదులకు వరదలు రావడంతో విజయవాడ, గుంటూరు, పల్నాడు జిల్లాలలో చాలా మంది ప్రజలు ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అన్నారు. వారికి మానవతా దృక్పథంతో సహాయం చేయాలన్నారు. సహాయం అందజేసే వారు అకౌంట్ నంబర్ 144010100020171, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0814407, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కలెక్టరేట్ బ్రాంచ్, జిల్లా రెవెన్యూ అధికారి, కాకినాడ అనే అడ్రస్‌కు పంపవచ్చన్నారు.

కాకినాడలో ఎద్దు వీరంగం

నలుగురికి గాయాలు

కాకినాడ క్రైం: కాకినాడలో ఓ ఎద్దు వీరంగం సృష్టించింది. రోడ్డుపై తిరుగుతూ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో భానుగుడి కూడలిలో విధులు నిర్వర్తిస్తున్న ఓ హోంగార్డును వెనుక నుంచి పొడిచింది. ఈ ఘటనలో హోంగార్డు సీకేడీఎస్‌వీ మహేష్‌కు కుడి తొడ వెనుక భాగంలో ఎద్దు కొమ్ము దిగింది. అతనిని స్థానిక అపోలో ఆసుపత్రికి తరలించారు. అదుపు చేసే క్రమంలో ఎద్దు బీభత్సం చేసింది. దారిన పోయే వారిని కుమ్ముకుంటూ పరుగులు తీసింది. ఎద్దు పరుగులు పెడుతున్న రహదారుల నుంచి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం ట్రాఫిక్ పోలీసులకు కత్తిమీద సాముగా మారింది. అటుగా వస్తున్న ఓ బ్యాంక్ ఉద్యోగిని తీవ్ర గాయాలపాలైంది. ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎద్దు తోసేసి ఆమెను తొక్కుకుంటూ వెళ్లిపోయింది. భానుగుడి నుంచి మెయిన్ రోడ్ వైపుగా పరుగెడుతూ, జగన్నాథపురానికి చేరింది. అటు నుంచి వార్ఫ్ రోడ్ నుంచి మళ్లీ కట్టిలమ్మ అడితిలోకి ప్రవేశించింది. అక్కడే ఓ మూల నక్కి ఉండగా అప్పటికే సమాచారం అందుకున్న ఏడీఎఫ్‌వో ఏసుబాబు ఆధ్వర్యంలోని జగన్నాథపురం ఫైర్ రెస్క్యూ బృందాలు, పోలీస్, వెటర్నరీ వైద్యులు అక్కడికి చేరుకున్నారు. బలమైన తాళ్లతో ఎద్దును అదుపులోకి తెచ్చారు. ఆరోగ్య స్థితిని పరిశీలించిన పశువైద్యులు ఇంజెక్షన్లు ఇచ్చి ఎద్దు మానసిక స్థితిని నిలకడ చేశారు. కాసేపటికి నాగమల్లి తోటలో ఉన్న గో సంరక్షణ కేంద్రం ఎస్‌పీసీఏకి తరలించారు. ఈ ఘటనలో ఎద్దు వీరంగానికి వివిధ ప్రాంతాల్లో నలుగురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. తీవ్ర గాయాలైన హోంగార్డును ట్రాఫిక్ సీఐ ఎస్.రమేష్ అపోలో ఆసుపత్రిలో పరామర్శించారు.



తాళ్లతో ఎద్దును అదుపు చేస్తున్న రెస్క్యూ బృందాలు



చికిత్స పొందుతున్న హోంగార్డు మహేష్‌ను పరామర్శిస్తున్న ట్రాఫిక్ సీఐ రమేష్

సత్యదేవా నమో నమః

ఘనంగా స్వామివారి జన్మ నక్షత్ర పూజలు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని జన్మ నక్షత్రం 'మఖ' సందర్భంగా సోమవారం అన్నవరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సత్యదేవునికి జన్మ నక్షత్ర పూజలు, మూలవిరాట్‌కు అభిషేకాలు, ఆయుష్య హోమం నిర్వహించారు. ఆలయాన్ని తెల్లవారు జామున రెండు గంటలకు తెరిచి ఈ క్రతువులు జరిపారు. అనంతరం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం దేవతామూర్తులకు ముత్యాల కవచాల (ముత్తంగి సేవ) అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ ఆయుష్య మండపంలో స్వామివారికి హోమం చేశారు. హోమ గుండంలో ద్రవ్యాలను సమర్పించి ఆయుష్య హోమం పూర్ణాహుతి సమర్పించారు. ఈ ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పర్యవేక్షించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనాపాఠి, చిట్టి శివ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకుడు సుధీర్, పరిచారకుడు శివ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

అన్నవరంలోని సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా 32 రోజులకు గాను రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. ఇందులో నగదు రూ.1,58,68,781 కాగా, చిల్లర నాణేలు రూ.5,49,820 వచ్చాయని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు.



సత్యదేవుని ఆయుష్య హోమ పూర్ణాహుతిలో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ రోహిత్ తదితరులు

వీటితో పాటు బంగారం 44 గ్రాములు, వెండి 880 గ్రాములు, విదేశీ డాలర్లు కూడా ఉన్నాయి. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాలుపంచుకున్నారు.

వివాహాల సందడితో ఆదాయం

గత నెల ఆరో తేదీ నుంచి ఈ నెల రెండో తేదీ వరకూ శ్రావణ మాసం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు సత్యదేవుని ఆలయానికి తరలివచ్చారు. దీంతో దేవస్థానానికి దండిగా ఆదాయం సమకూరింది. సుమారు మూడు నెలల విరామం అనంతరం శ్రావణ మాసంలో వివాహాలు ప్రారంభం కావడంతో నవ దంపతులు, వారి బంధువులు పెద్ద సంఖ్యలో సత్యదేవుని ఆలయానికి విచ్చేశారు. వీరంతా స్వామివారి వ్రతాలు ఆచరించి దర్శనం చేసుకున్నారు. హుండీలలో పెద్ద సంఖ్యలో కానుకలు సమర్పించారు.



సత్యదేవుని హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సినీ ఫక్కీలో కిడ్నాప్

- ఛేదించిన పోలీసులు
- బాధితుడు సురక్షితం

కాకినాడ క్రైం: కాకినాడలో ఓ వ్యక్తి సినీ ఫక్కీలో కిడ్నాప్‌కు గురయ్యాడు. పోలీసులు అతన్ని సురక్షితంగా తీసుకొచ్చారు. ఆ వివరాలు ఇలా.. కాకినాడ రమణయ్యపేటకు చెందిన పుట్టా వీరభద్రరావు, గరికట్ల సాయిప్రసాద్ అనే వ్యక్తులకు గత కొద్ది కాలంగా సివిల్ వివాదాలు ఉన్నాయి. అందుకు సంబంధించి కోర్టులో కేసు నడుస్తుండగా ఇరువురూ కాకినాడలోని ఫోర్త్ ఏజేఎఫ్‌సీఎం కోర్టుకు హాజరయ్యారు. వాదనలు పూర్తయ్యి బయటకు వస్తుండగా సాయిప్రసాద్, అతడి డ్రైవర్ కలిపి వీరభద్రరావును బలవంతంగా తమ కారు ఎక్కించి తాళ్లతో కట్టి దాడి చేశారు. గాయపడిన వీరభద్రరావును సాయిప్రసాద్ స్వగ్రామం అరట్లకట్టకు తరలించి అక్కడ ఓ గదిలో బంధించాడు. అయితే కోర్టు ఆవరణలో వ్యక్తిని బలవంతంగా కారు ఎక్కించడాన్ని చూసిన ఓ వ్యక్తి డయల్ 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. తక్షణమే అప్రమత్తమైన కాకినాడ ఒకటో పట్టణ పోలీసులు సీఐ నాగదుర్గారావు ఆధ్వర్యంలో గాలింపు మొదలు పెట్టారు. కారు నంబరు గుర్తించి, బాధితుడి సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అరట్లకట్టలోని బంధించిన ఇంటికి చేరుకున్నారు. వీరభద్రరావును క్షేమంగా విడిపించారు. అతడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కిడ్నాప్‌కు పాల్పడిన సాయిప్రసాద్, అతడి డ్రైవర్ కూడా పరారీలో ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్తు పరికరాలు వాడాలి

రాజమహేంద్రవరం రూరల్: ఇళ్లలో వినియోగించే విద్యుత్ పరికరాలు ఐఎస్ఐ మార్కు కలిగి ఉండేలా చూసుకోవాలని, తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఈపీడీసీఎల్) ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.తిలక్‌కుమార్ అన్నారు. సోమవారం ఏపీ ఈపీడీసీఎల్, రాజమహేంద్రవరం సర్కిల్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో తేదీన నిర్వహించే విద్యుత్ భద్రతా దినోత్సవం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వినియోగదారులతో ప్రతిజ్ఞ చేయించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఈ తిలక్‌కుమార్ మాట్లాడుతూ సబ్ స్టేషన్ పరిధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయదారులు, రైతు కూలీలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమల్లో విద్యుత్ జాగ్రత్తలు, గృహ వినియోగదారులు పాటించాల్సిన నియమాలను వివరించారు. కార్యక్రమంలో డీఈఈలు గాబ్రియేలు, మాల్యాద్రి, ఏఈలు పాల్గొన్నారు.